క్లుప్తంగా

వైద్యాధికారి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మౌనిక

మందస: మందస మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ కె.మౌనిక బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కవిటి పీహెచ్‌సీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ విధులు నిర్వహించిన ఎం.సంపత్ కుమార్ వెంకటాపురం బదిలీపై వెళ్లారు. నూతన వైద్యాధికారి మౌనిక మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

కొళిగాంలో పారిశుద్ధ్య పనులు



వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. 'కొళిగాంలో క్షీణించిన పారిశుద్ధ్యం' శీర్షికన ఈ నెల 22వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం గ్రామంలోని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయడంతోపాటు చెత్తా చెదారాలను తొలగించారు.

వైభవంగా జగన్నాథ స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

టెక్కలి: పట్టణంలోని గోపాల జగన్నాథస్వామి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో మనస్వి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణంతో పాటు నేత్రోత్సవాన్ని నిర్వహించగా.. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

'అవి చీకటి రోజులు'



నోటికి నల్ల రిబ్బన్‌తో బాలక్రిష్ణయాదవ్

కాశీబుగ్గ: ప్రధాన మంత్రి హోదాలో ఇందిరాగాంధీ 1975 సంవత్సరంలో విధించిన ఎమర్జెన్సీ రోజులను ప్రజలు మరిచిపోలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ అన్నారు. ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలైన సందర్భంగా నోటికి నల్లని రిబ్బను కట్టుకొని పలాసలో బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలు చీకటి రోజులను అనుభవించారని గుర్తు చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని విధించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం టౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.జయసింహ కోరారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల అసోసియేషన్ సమావేశం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో బుధవారం జరిగింది. కంపెనీ మూతపడి 11 సంవత్సరాలైనప్పటికీ నష్టపోయిన ఖాతాదారులు, ఏజెంట్లకు న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం కల్పించుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటరావు, నల్ల ప్రసాద్, పి.అర్జున్, విద్యాధరబెహరా, నారాయణబాడిత్య, రోజా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలని వినతి

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి.విజయరామరాజుని విజయవాడలోని కార్యాలయంలో బుధవారం కలిసి విన్నవించారు. 11 వందల మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు లేని విషయాన్ని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. తెలుగు, ఒరియా, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన జరుగుతున్న ఈ పాఠశాలలో ప్రస్తుత విద్యావిధానం ప్రకారం 44 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 25 మందే ఉన్నారన్నారు. ఇంగ్లిష్-3, తెలుగు- 5, గణితం-3, సైన్స్-3, పీడీ- 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు డైరెక్టర్‌కు విన్నవించినట్టు తెలిపారు.

గౌరవానికి నోచుకోలేదు..!

- ఎంపీటీసీ సభ్యులకు అందని గౌరవ వేతనం
- సర్వసభ్య సమావేశాలకే పరిమితం
- సమస్యలు విన్నవించినా పట్టించుకోని అధికారులు



కంచిలి మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు (ఫైల్)

కంచిలి: రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను విస్మరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకు గౌరవ వేతనం కూడా మంజూరు చేయలేదు. కనీసం ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వనప్పటికీ.. గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడంపై సభ్యులు మండిపడుతున్నారు. ఇదే సమయంలో ఎలాంటి హోదా లేనప్పటికీ టీడీపీ నాయకులకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎంపీటీసీ సభ్యుల వివరాలు

మండలం	ఎంపీటీసీ సభ్యుల సంఖ్య
ఇచ్ఛాపురం	16
కవిటి	22
కంచిలి	19
సోంపేట	23
మొత్తం స్థానాలు	80



కంచిలి మండల పరిషత్ కార్యాలయం

వేతనం కోసం ఎదురు చూపులు..

ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 80 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతినెలా మూడు వేల రూపాయలను గౌరవ వేతనంగా ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సక్రమంగానే గౌరవ వేతనం చెల్లించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు సభ్యులకుగౌరవ వేతనం చెల్లించలేదు. కనీసం ఆ అంశంపై దృష్టిసారించడం లేదు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికి రెండుసార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగినా ప్రజాప్రతినిధుల ఖాతాల్లో మాత్రం నగదు జమకాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఎంపీటీసీ సభ్యులంటే చులకన భావం..



ప్రజలతో ఎన్నుకోబడిన ఎంపీటీసీ సభ్యులంటే అధికార యంత్రాంగం చులకన భావంతో చూస్తున్నారు. అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడం, పథకాల సమాచారం కూడా ఇవ్వకపోవడం వంటి చర్యలతో అవమానిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. – బుద్దెపు విశ్వనాథరెడ్డి, మఠం సరియాపల్లి ఎంపీటీసీ సభ్యుడు, కంచిలి మండలం

కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు..



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీ సభ్యులకు అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు. ప్రజలతో ఎన్నుకోబడిన తమకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు. కేవలం తాము సర్వసభ్య సమావేశాలకే పరిమితం అవుతున్నాం. – కర్రి గోపయ్య, వైస్ ఎంపీపీ, కవిటి మండలం

గౌరవ వేతనం మంజూరు చేయాలి..



పెండింగ్‌లో ఉన్న 15 నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయాలి. స్థానికంగా నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించడం లేదు. కేవలం సర్వసభ్య సమావేశాలకే పరిమితం అవుతున్నాం. – నీలావతి దొలాయి, కొక్కిలిపుట్టుగ ఎంపీటీసీ సభ్యురాలు, కంచిలి మండలంచ

సర్వసభ్య సమావేశాలకే పరిమితం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశాలకు మాత్రమే పరిమితమయ్యారు. సమావేశాలకు హాజరు కావడం మినహా ప్రజా సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు పేర్కొంటున్నారు. కనీసం ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలకు సైతం ఆహ్వానించకపోవడం దారుణమని వాపోతున్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



ఖరీఫ్ సీజన్‌లో వరి విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకుంటే ఎటువంటి తెగుళ్లు దరిచేరవని, పంటను పూర్తిగా రక్షించుకోవచ్చునని ఐసీఆర్‌పీ కృష్ణవేణి అన్నారు. సోంపేట మండలం పలాసపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాముహికంగా విత్తనశుద్ధిపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. – సోంపేట

ఉద్యోగుల నిరసనలు



తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సచివాలయాల ఉద్యోగులు మందస మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. సచివాలయాల్లోని అన్ని శాఖల ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలు చేసిన తర్వాతే బదిలీలు చేపట్టాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, పెండింగ్ ఎరియర్లను చెల్లించాలని ఉద్యోగులు కోరారు. – మందస

మహిళా రైతు సంఘాల ఏర్పాటు



అర్హులైన మహిళా రైతులచే రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. బుధవారం ఇచ్ఛాపురంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది వరకు సంఘాలుగా ఏర్పడి ఉన్న సభ్యులందరూ బ్యాంకు ద్వారా రుణాలు పొంది జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సత్కారం



మందస: దిపిక, పార్వతీలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



కవిటి: విద్యార్థులను సత్కరిస్తున్న బొరివంక పాఠశాల సిబ్బంది



వజ్రపుకొత్తూరు రూరల్: జశ్వంత్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



కాశీబుగ్గ: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మందస: పొత్తంగి సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని కొండపల్లి దీపిక ట్రిపుల్ ఐటీ న్యూజివీడు క్యాంపస్‌కు ఎంపికైనది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగిరి తారకేశ్వరరావు, సిబ్బంది దీపికతోపాటు ఆమె తల్లి పార్వతీలను బుధవారం సత్కరించి అభినందించారు.

కవిటి: బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. దీంతో వారిని హెచ్‌ఎం సనపల రామకృష్ణ అధ్యక్షతన సత్కరించి.. జ్ఞాపికలను అందజేసి అభినందించారు. బొరివంక సర్పంచ్ బి.శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సతీష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.జశ్వంత్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైయ్యారు. దీంతో జశ్వంత్‌తోపాటు తల్లిదండ్రులను ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. అలాగే అదే పాఠశాలకు చెందిన ఎస్.నవదీప్, కె.చైతన్య, బి.గులాబిలు ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చడంతో వారిని కూడా అభినందించారు. ప్రధానోపాధ్యాయులు టి.హేమరావు, పాఠశాల కమిటీ చైర్మన్ బి.లక్ష్మీపతి, పీడీ పి.గణేంద్ర ఉన్నారు.

కాశీబుగ్గ: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కణితి వెన్నెల, సప్ప విక్యత్, పప్పు తేజశ్రీ, రాపాక షైనీ, బి.లిఖిత, పవన్‌కుమార్ పండా, కె.వీణ, పి.లేహిత్, ఎస్.కార్తికేయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. దీంతో వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు కిల్లి వెంకటరావు, లక్ష్మణరావు, తారక రామారావు, మోహనరావు, జయరామ్, శరత్‌బాబు పాల్గొన్నారు.

యూపీ పాఠశాల రద్దు కాకుండా చూడాలి

మందస: హోన్నాలి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల రద్దు కాకుండా చూడాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. ఈ మేరకు ఎంఈవో ఎం.లక్ష్మణరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల రద్దయితే ఇప్పటి వరకూ ఇక్కడ చదివిన పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎంఈవోలు ఇచ్చే నివేదిక ఆధారంగానే పాఠశాలలను ప్రభుత్వం రద్దు చేస్తోందని.. ఈ పరిస్థితిలో విద్యాశాఖాధికారులే హోన్నాలి పాఠశాల గ్రామంలో కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాజాన పరమేశ్వరరావు, జగదీష్ బడిత్య, సోమనాథ్‌సిస్తు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనకాపల్లి కలెక్టరేట్ ముఖ్య ప్రణాళిక అధికారి గేదెల రామారావు ఆర్థిక సాయంతో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. యూవీవీ అధ్యక్షుడు బొమ్మాళి శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు వీర్రాజు, గౌరవ అధ్యక్షులు కుత్తుం ప్రకాశరావు, కోదండరావు, తెప్పల వాసుదేవరావు, పోతనపల్లి గీతమ్మ, చిన్నారావు ఉన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన జిల్లా నేతలు





మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు తాడేపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై జగన్ ఆరా తీసినట్టు విజయ, రామారావు తెలిపారు. – కంచిలి

డిగ్రీ కళాశాలలో సంవిధాన్ హత్యా దివస్



ప్రిన్సిపాల్ గోవిందమ్మ

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బుధవారం సంవిధాన్ హత్యా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధింపు దాని పర్యావసనాల గురించి ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్, రాజనీతి శాస్త్రం అధ్యాపకుడు టి.త్రినాథరావు, అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, ఎ.రామారావు, కోటేశ్వరరావు, ఎస్.ధర్మారావు పాల్గొన్నారు.

ఉత్సవానికి వేళాయె..

- రేపటి నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు
- జూలై 1 న హిరా పంచమి
- 5న మారుదశమితో ముగింపు యాత్ర



ఉత్సవాలకు టెక్కలిలో సిద్ధమైన రథం



స్వామి వారు రోజుకోఅవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్న గుండిచాదేవి ఆలయం



ముస్తాబైన జగన్నాథస్వామి

టెక్కలి: ఒడిశాతో పాటు ఆంధ్రా ప్రాంత ప్రజలకు ఆరాధ్యదైవమైన జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఈ నెల 27వ తేదీ నుంచి టెక్కలిలో ఘనంగా ప్రారంభం కానున్నాయి. రాజుల కాలం నుంచి నేటి వరకు పట్టణంలో ఏటా రథయాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. స్థానిక పెద్ద బ్రాహ్మణవీధిలో ప్రారంభం కానున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖాధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు కుటారి పండా, పి.ప్రతాప్, తరణి పండా, ప్రపుల్లా పారిడా, హరిశ్చంద్ర ప్రధానో తదితరుల నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక బ్రాహ్మణవీధితో పాటు పోలవరం, డమర గ్రామాల్లో ఉత్సవాలను నిర్వహిస్తారు. జూలై ఐదో తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో స్వామి వారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 27వ తేదీన బ్రాహ్మణవీధిలో మొదటి రథయాత్రతో ప్రారంభమై పాత జాతీయ రహదారిలోని గుండిచాదేవి ఆలయంలో మిగిలిన యాత్ర జరుగుతుంది. ఇదే ఆలయంలో 28న మత్స్యావతారం, 29న కూర్మావతారం, 30న వరహా అవతారం, జూలై ఒకటో తేదీన హిరాపంచమి సందర్భంగా నరసింహా అవతారం, రెడండు పరశురాముని అవతారం, మూడున రామావతారం, నాలుగో తేదీన కృష్ణావతారం, ఐదున మారు రథయాత్రతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బంది ప్రత్యేక బందోబస్తును నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఓంకార్ మాస్టార్ ఆశయాలు ఆదర్శనీయం



ఓంకార్ మాస్టార్ చిత్రపటం వద్ద విప్లవ జోహర్లు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధ్యాయుడుగా పని చేస్తూ అనేక ప్రజా సంఘాల నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తూ ఉద్దాన రైతులు, కిడ్నీ బాధితులు, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన కామ్రేడ్ ఓంకార్ మాస్టార్ ఆశయాలు ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. నగరంపల్లి గ్రామంలో ఓంకార్ ప్రథమ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి విప్లవ జోహర్లతో నివాళులర్పించారు. ఉపాధ్యాయుడుగా, ఉద్యమ నాయకుడుగా అనేక సమస్యలపై ఎంతో నిబద్ధతతో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు బమ్మిడి అనందరావు, నెయ్యిల మోహన్‌రావు, జి.సుగుణ, ఎస్.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పలాస: మానకన్నపల్లిలో ఓంకార్ మాస్టర్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్ వర్మ, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సీపీఎం నాయకులు ఎన్.గణపతి, సర్పంచ్ సైని దేశయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలి



సుశీలకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

సోంపేట: బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు అన్నారు. ఏపీజీబీ కొర్లాం శాఖ ఆధ్వర్యంలో రెల్ల ధర్మరావు అనే ఖాతాదారుడు 500 రూపాయల బీమా చేయించుకున్నాడు. రహదారి ప్రమాదంలో అతను మృతి చెందడంతో అతని భార్య సుశీలకు బీమా నగదు రూ. పది లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో బ్యాంకు అధికారులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలపై ఖాతాదారులకు స్పష్టమైన అవగాహన లేక పోవడంతో బీమా, ఇతర సదుపాయాలు పొందలేక పోతున్నారన్నారు. కర్తలి పాలెం సర్పంచ్ గున్నయ్య, మాజీ సర్పంచ్ పాపారావు, బ్యాంకు అధికారులు వై.రామారావు, ఎం.మాధవ్ సాహో, మీనా పాల్గొన్నారు.

నేడు యాంటి డ్రగ్స్‌పై ర్యాలీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గురువారం సాయంత్రం యాంటిడ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు స్థానిక డీఎస్పీ వెంకటఅప్పారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి కాశీబుగ్గ వరకు నిర్వహించే ర్యాలీలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

సంక్షేమ భవనం మంజూరు చేయండి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో విశ్వకర్మ శిల్పి సంక్షేమ సంఘానికి సంక్షేమ భవనం మంజూరు చేయడంతోపాటు నిధులు కేటాయించాలని విశ్వకర్మ శిల్పి సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు పలాసలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావును బుధవారం కలిసి విన్నవించారు.